క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

లావేరు: మండల కేంద్రం లావేరులోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు బూరాడ చిన్నారావులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుల వద్ద ఉన్న ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, పీఏసీఎస్ సీఈవో సత్యన్నారాయణ, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు వినతుల వెల్లువ

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం రెండో డిపో మేనేజర్ కె.ఆర్.ఎస్.శర్మ మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి పలువురి నుంచి వినతులు అందాయి. బుడితి-జలుమూరు రాత్రి 7:30 గంటల తర్వాత విద్యార్థుల బస్సుపాసులను కండక్టర్ అనుమతించడం లేదని, శ్రీకాకుళం-విశాఖపట్నం పల్లెవెలుగు బస్సులు కావాలని, శ్రీకాకుళం-నరసన్నపేట, నరసన్నపేట-శ్రీకాకుళం వైపు వెళ్లే బస్సులు రామలక్ష్మణ కూడలి మీదుగా సూర్యమహల్, పాతబస్టాండ్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్సుకు నడపాలని, శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి డేఅండ్‌నైట్-ఏడురోడ్లు-పాతబస్టాండ్- అరసవిల్లి- సూర్యమహల్ - రామలక్ష్మణ-రైతుబజారు- తిరిగి డేఅండ్‌నైట్ కూడళ్ల మీదుగా కాంప్లెక్సు చేరే విధంగా సిటీ బస్సు వేయమని పలువురు కోరారు. వీటిపై సాధ్యాసాధ్యాలను ఆర్టీసీ అధికారులు అప్పటికప్పుడే వారికి వివరించారు.

మండల బడ్జెట్ వివరాలు వెల్లడి



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

లావేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లుట్ట అమ్మాజమ్మ అధ్యక్షతన 2023–24 సంవత్సరం అంచనా బడ్జెట్ సమావేశం మంగళవారం జరిగింది. సవరణ బడ్జెట్‌లో ఆదాయం రూ. 61,14,370, వ్యయం రూ.54,38,640, మిగులు 6,75,730 రూపాయలుగా చూపించారు. అంచనా బడ్జెట్‌లో ఆదాయం రూ.66,14,470, వ్యయం రూ.60,02,721, మిగులు రూ.6,11,749గా చూపించారు. బడ్జెట్ వివరాలను మండల పరిషత్ ఏవో సునీత చదివి వినిపించారు. సమావేశంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతన్నాయుడు, ఎంపీడీవో కె.సురేష్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ మాధవరావు, వైస్ ఎంపీపీ ఆలుపన నారాయణరావు పాల్గొన్నారు.

శక్తిపథ ఆంజనేయునికి పూజలు



పూజలందుకుంటున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: గుజరాతిపేటలోని జగన్నాథస్వామి ఆలయంలో కొలువైన శక్తిపథ ఆంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి అలంకరణ చేశారు.

విజయ గణపతికి ప్రత్యేక అలంకరణ



విజయగణపతి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో విజయగణపతి ఆలయంలో మార్గశిర మంగళవారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని కలెక్టర్ బంగ్లా సమీపంలో ఉన్న ఎస్టీ వీధిలో తండ్రీ, కుమార్తెలపై దాడికి సంబంధించి ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్లు ఒకటో పట్టణ ఎస్‌ఐ బలివాడ గణేష్ తెలిపారు.

ఆర్బీకేల వద్దే ధాన్యం కొనుగోలు

● ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



రణస్థలం: ధాన్యం కొనుగోలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రైతు భరోసా కేంద్రాల వద్దే ధాన్యం కొనుగోలు చేస్తామని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. వల్లభరావుపేట రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో రైతులు ధాన్యం విక్రయించుకోవాలన్నా, విత్తనాలు, ఎరువుల కొనుగోలు చేయాలన్నా కిలోమీటర్ల పొడవునా క్యూలైన్లలో నిలబడాల్సి వచ్చేదని, పోలీసుల లాఠీ దెబ్బలు తినేవారని గుర్తు చేశారు. ప్రస్తుత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామస్థాయిలో ఏర్పాటు చేసి రైతు భరోసా కేంద్రాల వద్దే ఎటువంటి ఇబ్బందుల్లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయడం, విత్తనాలు, ఎరువులు సమకూర్చుతున్నామని చెప్పారు. రైతు ఆరుగాలం శ్రమించి పండించిన ప్రతి ధాన్యపు గింజను మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని, తడిచిన, ముక్కిన, రంగు మారిన ధాన్యం కూడా కొనుగోలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, మండల పార్టీ అధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు, జేసీఎస్ కన్వీనర్ చిల్ల వెంకటరెడ్డి, మండల మహిళ అధ్యక్షురాలు గురాన మానస, మండల నాయకులు మైలపల్లి కామరాజు, చినరామినాయుడు, గొర్లె అప్పలనర్సునాయుడు, తిరుపతినాయుడు, మహంతి సత్యనారాయణ, గడి రమణ, బలరాం, పరిసినాయుడు ఉన్నారు.

సక్రమంగా ధాన్యం కొనుగోలు

జి.సిగడాం: ఆర్‌బీకేల్లో పని చేసే సిబ్బంది సక్రమంగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి యర్రా శారద అన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో సిబ్బందితో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులు పండించే ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందనే విషయాన్ని రైతులకు తెలియజేయాలన్నారు. అర్హులైన రైతులకు రైతుభరోసా పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లు సమీరా, అంపోలు అనూషా, తలచింతల కుసుమ పాల్గొన్నారు.



జి.సిగడాం: సిబ్బందితో మాట్లాడుతున్న ఏవో శారద

21న జగనన్న పుట్టినరోజు వేడుకలు



అంధవరపు సూరిబాబు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): సంక్షేమ పథకాలతో దేశ చరిత్రలోనే సంక్షేమ సారథిగా నిలిచిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఈ నెల 21న శ్రీకాకుళం నియోజవర్గంలో ఘనంగా నిర్వహించనున్నట్టు రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, సాధు వైకుంఠరావు, వైఎస్సార్ సీపీ రూరల్ అధ్యక్షుడు చిట్టి జనార్దనరావు, గార మండల అధ్యక్షుడు పీస గోపి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్దానం ప్రజల హృదయాలను పులకింపజేసి దశాబ్దాల కిడ్నీ రోగుల ఆక్రందనను తొలగించి.. వంశధార శుద్ధ జలనీరు అందించిన మహోన్నత మానవీయ నేత మన జగనన్న అని పేర్కొన్నారు. ఉదయం 7.30 గంటలకు రామలక్ష్మణ జంక్షన్‌లో వారాహి సహిత అమ్మవారి బగలముఖి హోమం, 9.30 గంటలకు గారలో మొక్కలు నాటడం, ఉదయం 10 గంటలకు టౌన్ హాల్‌లో రక్తదాన శిబిరం, మధ్యాహ్నం 12 గంటలకు బెహరా మనోవికాస కేంద్రంలో అన్నదానం, సాయంత్రం 5 గంటలకు బాపూజీ కళామందిర్‌లో వృద్ధ కళాకారులకు దుప్పట్ల పంపిణీ, సాయంత్రం 5.15 గంటలకు సాంస్కృతిక కార్యక్రమం ప్రారంభం, సాయంత్రం 5.30 గంటలకు డాక్టర్ రఘు పాత్రుని శ్రీకాంత్ శిష్యబృందం నృత్యప్రదర్శన, సాయంత్రం 7.30 గంటలకు కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌లు హాజరయ్యే ఈ వేడుకల్లో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో శ్రీచక్ర సిరిజ్యోతి పూజలు



పూజలు చేస్తున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలో ఉన్న బాలత్రిపుర కాలభైరవపీఠం దేవాలయంలో శ్రీచక్రరూపేన సిరిజ్యోతి పూజలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో మహిళలు శ్రీచక్రంపై దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఎల్‌సీఎం ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎంఈవోలు

లావేరు: ఎల్‌సీఎం (లో కాస్టు మేకర్) ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవోలు ఎల్.ఈశ్వరరావు, మజ్జి మురళీకృష్ణారావు అన్నారు. మురపాక గ్రామంలోని పీబీనగర్ కాలనీలో ఉన్న కేజీబీవీలో ఏర్పాటు చేసిన ఎల్‌సీఎం ల్యాబ్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ల్యాబ్ ద్వారా తక్కువ ఖర్చుతో పరికరాలు ఎలా తయారు చేయాలో బాలికలకు శిక్షణ ఇస్తామని చెప్పారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ బి.సుధ ఉన్నారు.

నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ



నిరాశ్రయులకు దుప్పట్లు కప్పుతున్న రెడ్‌క్రాస్ బృందం

శ్రీకాకుళం కల్చరల్: చలి తీవ్రత నేపథ్యంలో నిరాశ్రయులు, రోడ్డు పక్కన నిద్రిస్తున్న వారు, వృద్ధులు, మహిళలకు ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి దుప్పట్లు పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు ఆధ్వర్యంలో ఏడు రోడ్ల కూడలి, పాతబస్టాండ్, అరసవల్లి, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో 120 మందికి దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలిగాలుల నుంచి ఉపశమనం కలిగించేందుకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ సభ్యులు శ్యాంసుందర్, ప్రసాద్, రెడ్‌క్రాస్ సభ్యులు శ్రీకాంత్, కల్యాణ్ చక్రవర్తి, కె.సత్యనారాయణ, సతీష్ పాల్గొన్నారు.

గీతాశ్రీకాంత్‌కు ఉమెన్ అచీవ్‌మెంట్ అవార్డు



అవార్డు అందుకుంటున్న గీతాశ్రీకాంత్

శ్రీకాకుళం కల్చరల్: గీతం యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల కలయిక 'గీతం హోంకమింగ్' కార్యక్రమంలో భాగంగా గీతాశ్రీకాంత్‌కు ఉమెన్ అచీవ్‌మెంట్ అవార్డు లభించింది. రెండురోజుల పాటు విశాఖలో జరిగిన ఈ కార్యక్రమంలో వెయ్యిమంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ రంగాలలో ప్రతిభావంతులను గుర్తించి పురస్కారాలను ప్రదానం చేశారు. ఇందులో భాగంగా డాక్టర్ యార్లగడ్డ గీతాశ్రీకాంత్‌ను సేవా, వ్యాపార రంగాల్లో అందిస్తున్న సేవలను గుర్తించి గీతం చైర్మన్ ఎం.భరత్ ఈ అవార్డు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ గౌతమ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం

● ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



ఎచ్చెర్ల క్యాంపస్: సంతసీతారాంపురంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



గార: శ్రీకూర్మంలో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామ సచివాలయం స్థాయిలో ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. సంతసీతారాంపురం గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా పార్టీ జెండా ఎగరవేశారు. అలాగే ప్రభుత్వ పథకాల వివరాలతో కూడిన ప్రదర్శన బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న ఎన్నికలకు సన్నద్ధం కావాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేసినట్లు తెలిపారు. గ్రామ సచివాలయం యూనిట్‌గా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి వివరించాలన్నారు. ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న సీఎం జగన్‌కు రానున్న ఎన్నికల్లో ప్రజలందరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు ముద్దాడ శంకర్, జేసీఎస్ ఇన్‌చార్జి మూగి శ్రీరాములు, ఎస్సెసెల్ అధ్యక్షుడు లింగాల లక్ష్మణ, సర్పంచ్ దుంప అప్పయ్యమ్మ, నాయకులు దుంప చిన్నారెడ్డి, గవిరెడ్డి రవికుమార్ పాల్గొన్నారు.

గుర్రాలపాలెంలో..

లావేరు: గుర్రాలపాలెం గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు పార్టీ జెండాను ఎగురవేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి రాజినాయుడు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ షేక్‌చాన్‌బాషా, ఎంపీటీసీ సభ్యుడు జె.భానోజీరావు, సచివాలయ కన్వీనర్ శాంతాటి శ్రీనివాసరావు, పీఎంసీ చైర్మన్ ఉదయ్‌భాస్కర్, నాయకులు నాగరాజు, గోవిందరావు, సతీష్, కృష్ణ, అప్పలకొండ, రాము, రమణ, లక్ష్మీనారాయణ, ధర్మారావు, తౌడు, పాపారావు ఉన్నారు.

గార: రాష్ట్రంలో పారదర్శకమైన పాలన జరుగుతోందని వైఎస్సార్ సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు అన్నారు. మంగళవారం శ్రీకూర్మం-1 సచివాలయ పరిధిలో ఎంపీపీ గొండు రఘురామ్ ఆధ్వర్యంలో ' వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించి సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉంటే పథకాలు ఇంటికే వస్తాయన్నారు. సచివాలయం, రైతు భరోసా, వెల్‌నెస్ సెంటర్ల ద్వారా గ్రామాల్లో పాలన జరుగుతోందన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ బరాటం నాగేశ్వరరావు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, ఎంపీడీఓ సంజీవి రమణయ్య, మండల పార్టీ కన్వీనర్ పీస గోపి, వైస్ ఎంపీపీలు అంధవరపు బాలకృష్ణమూర్తి, అరవల రామకృష్ణ, ఊట అప్పలనాయుడు, పొదిలాపు శ్రీరాములు, అనుపోజు నాగరాజు, సుంకాన సురేష్, గుజ్జల అప్పలరాజు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో ఆంధ్రప్రదేశ్

రణస్థలం: గతంలో ఏన్నడూ లేనంతగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. వల్లభరావుపేట గ్రామ సచివాలయ పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించి సంక్షేమ పథకాల బోర్డును, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. గ్రామ పెద్దలతో గ్రామాభివృద్ధిపై మాట్లాడారు. సీఎం జగన్ ప్రజల పక్షపాతిగా ఉన్నారేతప్పా.. పార్టీల పక్షపాతిగా లేరన్నారు. అందుకే కులం, మతం, పార్టీలు చూడకుండా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెదరామినాయుడు, జేసీఎస్ కన్వీనర్ చిల్ల వెంకటరెడ్డి, మహిళ మండల అధ్యక్షురాలు గురాన మానస, నాయకులు మైలపల్లి కామరాజు, చినరామినాయుడు, గొర్లె అప్పలనర్సునాయుడు, తిరుపతినాయుడు, మహంతి సత్యనారాయణ, గడి రమణ, బలరాం, పరిసినాయుడు ఉన్నారు.



లావేరు: గుర్రాలపాలెంలో పార్టీ జెండాను ఎగురవేస్తున్న రాజినాయుడు



రణస్థలం: పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

టూరిజం క్లబ్ ఏర్పాటు



ప్రిన్సిపాల్ శ్రీనివాసరావుకి టూరిజం క్లబ్ ఏర్పాటు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న పర్యాటకశాఖ అధికారి నారాయణరావు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం యువ టూరిజం క్లబ్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి నడిమింటి నారాయణరావు మాట్లాడుతూ.. పర్యాటక కేంద్రాల సందర్శన, విజ్ఞాన సముపార్జన, ప్రతి అంశాలను తెలుసుకోవడానికి యువత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ నేపథ్యంలోనే కాలేజీల్లో యువ టూరిజం క్లబ్‌లు ఏర్పాటు చేయడంతోపాటు టూరిజంపై విస్తృత ప్రచారం కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. టూరిజం వల్ల ప్రాంతీయ అభివృద్ధి, ఆదాయం లభిస్తోందన్నారు. విదేశీయులను ఆకట్టుకునేలా కేంద్ర ప్రభుత్వం పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తోందని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ పీవో బి.ప్రసాదరావు, నెహ్రూయువ కేంద్రం కోఆర్డినేటర్ వెంకట్ ఉజ్వల్, గణాంకాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటుహక్కు



సమావేశంలో ఎస్‌డీసీ పద్మావతి, నాయకులు

రణస్థలం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తామని ఎచ్చెర్ల నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారిణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.పద్మావతి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు ఓటు హక్కు కల్పించేందుకు విస్తృత ఏర్పాటు చేశామని చెప్పారు. అలాగే అన్ని పార్టీల ప్రజా ప్రతినిధుల ఆమోదంతోనే ఓట్ల తొలగింపు, పేరు, అడ్రాస్, చేర్పులు, మార్పులు చేస్తున్నామని చెప్పారు. గత పది రోజులుగా నమోదైన ఓటర్లు, తొలగించిన ఓటర్ల జాబితాను వివరించారు. సమావేశంలో నాలుగు మండలాల తహసీల్దార్లు సనపల కిరణ్‌కుమార్, దీలిప్ చక్రవర్తి, టి.సత్యనారాయణ, పప్పల వేణుగోపాల్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ జి.కె.శ్రీనివాస్ ఉన్నారు.

సాగు పట్టాలు పంపిణీ



పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: సుమారు 20 ఏళ్లుగా పేద రైతులు సాగు చేసుకుంటున్న భూములకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయడంతో వారి కళ్లల్లో ఆనందం కనిపిస్తోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నారువ, క్రిష్టాపురం పంచాయతీ గోసాం పంచాయతీకి చెందిన పలువురు పేద రైతులకు భూ పట్టాలను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, నాయకులు చిల్ల వెంకటరెడ్డి, మైలపల్లి కామరాజు, మహంతి చినరామినాయుడు, గొర్లె అప్పలనర్సునాయుడు, క్రిష్టాపురం, నారువ సర్పంచ్‌లు కంబపు రామిరెడ్డి, కాటుకుని దేవి ఆర్ఐ శ్రావణి ఉన్నారు.

సహస్ర చండీహోమానికి ఏర్పాట్లు



సిద్ధమవుతున్న హోమ కుండాలు

శ్రీకాకుళం కల్చరల్: బలగ బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో ఈ నెల 20న నిర్వహించనున్న సహస్ర చండీ హోమానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ మంగళవారం తెలిపారు. విశాఖకు చెందిన కామాఖ్య పీఠం ప్రతినిధి వేణుశ్యామ్ నిర్వహణలో 108 హోమ కుండాలలో 1008 మంది భక్తులతో హోమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో పాల్గొనే ప్రతి ఒక్కరికీ వెయ్యి హోమాలు చేసిన పుణ్యం లభిస్తుందన్నారు. ఈ సమయంలో నిర్వహించే పారాయణలలో ప్రతి ఒక్కరూ పాల్గొనవచ్చని తెలిపారు. ముందుగా పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

విధి నిర్వహణలో అలసత్వం తగదు



మాట్లాడుతున్న వేణుగోపాలరావు

జి.సిగడాం: విధి నిర్వహణలో అలసత్వం తగదని తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, వీఆర్వోలతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉన్న ఓటర్ల నుంచి అభ్యంతరాలు ఉంటే వాటిని పరిష్కారం చేయాలన్నారు. ఎంపీడీవో కె.నిశ్చెల, ఈఓపీఆర్డీ ఎస్.శ్రీనివాసరావు, ఆర్ఐ రామచంద్రరావు ఉన్నారు.

'హనుమాన్' విజయం సాధిస్తుంది



చిత్రపోస్టర్ వద్ద థియేటర్ బృందం

శ్రీకాకుళం క్రైమ్ : అందరికీ ఇష్టమైన దేవుడు హనుమంతుని కథతో వస్తున్న హనుమాన్ చిత్రం మంచి చిత్రంగా నిలుస్తుందని ఎస్వీసీ-రామలక్ష్మణ థియేటర్ మేనేజర్ బి.రవికుమార్ అన్నారు. మంగళవారం థియేటరులో 700 మంది పిల్లలతో కలిసి చిత్రం ట్రైలర్ ప్రదర్శించరారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనవరి 12న విడుదల కానున్న ఈ చిత్రాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సాయి, భాస్కర్‌వర్మ, వినోద్, రవి, హేమసుందర్ పాల్గొన్నారు.

సీఎం పుట్టినరోజు వేడుకలు విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

రణస్థలం: ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాలుగు మండలాల నాయకులతో జన్మదిన వేడుకల సందర్భంగా చేపట్టబోయే కార్యక్రమాలపై మంగళవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. మెగా రక్తదాన శిబిరం, ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీతో పాటు ఆలయాల్లో పూజలు, సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ

శ్రీకాకుళం రూరల్: కల్లేపల్లి రైతు భరోసా కేంద్రంలో మంగళవారం సబ్ డివిజన్ ఏడీఏ బగ్గు రజనీ మాట్లాడుతూ పెసలు, మినుములు, మొక్కజొన్న నాటడం, ఎరువులు యాజమాన్య పద్ధతులు పద్ధతులు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఉషాకుమారి, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు సర్పంచ్ గంగు నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.